సాక్షి గుంటూరు

శనివారం । 16 । ఆగస్టు । 2025



ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గాపీఠం 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ వేడుకల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారికి సారె

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో శుక్రవారం పద్మావతి అమ్మవారికి సారె సమర్పించారు.

పెద్దింటమ్మకు గాజుల అలంకారం



అమరావతి: స్థానిక గ్రామ దేవత పెద్దింటమ్మ గుడిలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని గాజులతో వైభవంగా అలంకరించారు. అనంతరం పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో స్వాతంత్య్ర వేడుకలు



గుంటూరు లీగల్: జిల్లా కోర్టులో 79వ స్వాతంత్య్ర వేడుకలు అంగరంగ వైభవంగా శుక్రవారం జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి, అతిథులుగా జిల్లా కోర్టు న్యాయమూర్తులు హాజరయ్యారు. గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివ సూర్యనారాయణ జాతీయ జెండా ఆవిష్కరించారు. న్యాయవాదులకు, న్యాయవాద గుమస్తాలకు, కోర్టు సిబ్బందికి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోతుకూరు శ్రీనివాసరావు, ఈసీ మెంబర్స్ బార్ అసోసియేషన్ తరఫున న్యాయవాదులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

గుంటూరు రేంజ్ కార్యాలయ ఆవరణలో వేడుకలు



నగరంపాలెం: గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి జెండా ఎగురవేసి, గౌరవ వందనం చేశారు. అనంతరం కార్యాలయ, పోలీస్ సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఆర్ఎస్ఐలు సంపంగిరావు, ప్రసాద్, అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమైక్యతే భారత దేశం శక్తి

జేసీ భార్గవ్ తేజ



గుంటూరు వెస్ట్: భారత దేశం అనేక మతాలు, కులాలు, జాతులు, భాషల సమ్మిళితమై ఉన్నప్పటికీ అంతా కలిసిమెలసి జీవిస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తెలిపారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలకోర్చి నేడు దేశం అభివృద్ధి దిశగా కొనసాగుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రాభివృద్ధికి ఇతోధికంగా సహకరిస్తున్నారని చెప్పారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను యువత అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : పలువురికి తీవ్ర గాయాలు

ఒకరి పరిస్థితి విషమం

మేడికొండూరు : మండల పరిధిలోని గుండ్లపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన మహిళలు నల్లపాడు పరిధిలో ఓ వివాహానికి వెళుతూ పాటిబండ్ల నుంచి వస్తున్న ఆటో ఎక్కారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్ దాటిన తర్వాత గుండ్లపాలెం వద్ద ఎదురుగా గేదె అడ్డు రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. సిరిపురం గ్రామానికి చెందిన మిరియాల లిల్లీ రాణి తీవ్రంగా గాయపడింది. ఆమెను ఆటో లాక్కొని వెళ్లడంతో పక్కటెముకలు దెబ్బతిన్నాయి. కుడి చేయితో పాటు ఒళ్లంతా గాయాలయ్యాయి. తలకు తీవ్ర గాయమై పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆమెను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మది నిండుగా.. తిరంగా పండుగ

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పాల్గొన్న పలు పాఠశాలల విద్యార్థులు
- ఆకట్టుకున్న పలు ప్రభుత్వ శాఖల శకటాలు
- సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలకు బహుమతులు అందించిన రాష్ట్ర మంత్రి లోకేష్

నగరంపాలెం: నగరంలోని పోలీసు కవాతు మైదానంలో 79వ స్వాతంత్య్ర వేడుకలు శుక్రవారం సందడిగా సాగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్య అతిథిగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. దేశభక్తి గీతాలకు జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. తొలుత ప్రదర్శించిన జయహో.. జయ భారతీ జననీ వంటి దేశభక్తి గీతాలకు నృత్యాలు ఆహూతులను అలరించాయి. శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్‌కు ప్రథమ బహుమతి, ఎస్ఎస్ఎన్ ప్రభుత్వ పాఠశాలకు (బ్రాడీపేట) రెండో బహుమతి , శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాలకు (లక్ష్మీపురం) తృతీయ బహుమతులు లభించాయి. రాష్ట్ర మంత్రి నారా లోకేష్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ్, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు బహుమతులను అందించారు. అనంతరం నిర్వహించిన ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యాశాఖకు ప్రథమ బహుమతి, డీఆర్‌డీఏ, మెప్మాకు ద్వితీయ బహుమతి, జీఎంసీకి తృతీయ బహుమతులు లభించాయి. పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను రాష్ట్ర మంత్రి లోకేష్ సందర్శించారు. ఆయా శాఖల ఉత్పత్తులు, సామర్థ్యం వివరాలను అధికారులు, సిబ్బంది ఆయనకు వివరించారు.



ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేష్



సాంస్కృతిక నృత్యంలో విద్యార్థులు



త్రివర్ణ పతాకంతో విద్యార్థులు

మార్పు మన నుంచే మొదలుకావాలి

మంత్రి నారా లోకేశ్

సాక్షి ప్రతినిధి, గుంటూరు : ప్రపంచంలో ఏ మార్పు రావాలని కోరుకుంటున్నావో అది నీ నుంచే మొదలవ్వాలని మహనీయుడు గాంధీజీ ఇచ్చిన స్ఫూర్తితో మార్పు మన నుంచే మొదలుకావాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. గుంటూరు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. లోకేశ్ మాట్లాడుతూ దేశమంతా కలిసి చేసుకునే ఒకే ఒక్క పండుగ జెండా పండుగ అన్నారు. గుంటూరు జిల్లాలో జరిగిన స్వాతంత్య్రోద్యమంలో పాల్గొన్న ప్రముఖులు, ఆనాటి ఘట్టాలను గుర్తుచేస్తూ మంగళగిరిలో మ్యూజియం ఏర్పాటు చేయబోతున్నట్లు లోకేశ్ ప్రకటించారు. ఈ జిల్లాకు చెందిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, కన్నెగంటి హనుమంతు, పర్వతనేని వీరయ్య చౌదరి, తమనంపల్లి అమృతరావు వంటి ఎంతోమంది దేశభక్తులు స్వాతంత్య్రోద్యమంలో పాల్గొన్నారని ఆయన గుర్తుచేశారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ముప్పై ఏళ్ల వెనక్కి నెట్టిందని లోకేశ్ ఆరోపించారు. ప్రస్తుతం డబుల్ ఇంజిన్ సర్కారుతో రాష్ట్రం చీకటి నుంచి వెలుగు వైపు తొలి అడుగు వేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.





ప్రదర్శనలో ప్రభుత్వ శాఖల శకటాలు



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న పోలీసులు

ఎమ్మెల్యేలది ఓ దారి... ఎమ్మెల్సీది మరోదారి !

ఉచిత బస్సు ప్రారంభోత్సవంలో టీడీపీ నేతల మధ్య మనస్పర్థలు



ఉచిత బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

పట్నంబజారు: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని మహిళలకు ఉచిత బస్సు కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఎడ మొహం.. పెడ మొహంగా ఉన్నారు. బస్సుల ప్రారంభోత్సవానికి గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎండీ.నసీర్ అహ్మద్, గల్లా మాధవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్రతోపాటు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయవాడ సెక్టార్ వైపు బస్సులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించగా, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవిలు డిపో-2 పరిధిలో బస్సులను ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్ చేరుకున్న మేయర్ రవీంద్ర కూడా ఎమ్మెల్యేతో అంటీ ముట్టనట్లు వ్యవహరించారు. కనీసం ఆర్టీసీ బస్టాండ్‌లో గంటకు పైగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పలకరించుకోకపోవడం గమనార్హం. ఆర్టీసీ బస్టాండ్ వేదికగా వారి మధ్య మనస్పర్థలు బయటపడ్డాయనే వాదనలు వినవస్తున్నాయి.



డిపో–2లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు

చిన్నబాబుకు అధికారులు సెల్యూట్

- రాజకీయ వేదికగా మార్చేసిన మంత్రి లోకేష్
- సొంతింటి కార్యక్రమంగా నిర్వహణ
- మీడియాపై అణువణువునా ఆంక్షలు
- తమ అనుకూల పత్రికకు మీడియా హక్కులు ధారాదత్తం
- మిగితా వారికి నో ఎంట్రీ

నారా లోకేష్ సేవలో తరించిన జిల్లా అధికారులు

గుంటూరు వెస్ట్: ఎందరో మహనీయుల త్యాగంతో సాధించుకున్న స్వాతంత్య్ర దినోత్సవాన్ని కూటమి ప్రభుత్వం అవహేళన చేసింది. గుంటూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్య్ర వేడుకలు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కనుసన్నల్లోనే జరిగాయి. అధికారులు తమ హోదాలను మరిచి చిన్నబాబు సేవలో తరించారు. ఇతరులను అనుమతించకుండా తమ అనుకూల మీడియాకే అధికారం మొత్తం అప్పజెప్పారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై దాడి

మంత్రి లోకేష్ ప్రసంగంలో రాజకీయాలకు, కుల మతాలతకతీతంగా పాలన సాగిస్తామంటూనే గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ఆరోపణలకే ప్రాధాన్యం ఇచ్చారు. తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసిందంటూ బురద జల్లారు. తమ ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన సుమారు రూ.2 లక్షల కోట్ల అప్పుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం విశేషం. స్వాతంత్య్ర వేడుకల్లో గతంలో ఏ ప్రభుత్వం ఉన్నా జిల్లా ఇన్‌చార్జి మంత్రి అయినా, రాష్ట్ర మంత్రి అయినా జిల్లా అభివృద్ధి గురించి ప్రస్తావించేవారు. కానీ లోకేష్ ప్రసంగం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై దాడిగా సాగింది. జిల్లా అభివృద్ధి గురించి పక్కన పెట్టారు. ప్రసంగాన్ని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడంతోనే ప్రారంభించారు. లక్షల ఉద్యోగాలు, అద్భుతమైన ఇండస్ట్రీలు వచ్చేస్తాయంటూ త్రిశంకు స్వర్గాన్ని చూపించారు. లోకేష్ స్వోత్కర్షపై కొందరు అధికారులు ఇదేంటి అంటూ గుసగుసలాడారు. కార్యక్రమాన్ని కూడా అధికారులు ఒక నిర్దిష్ట పద్ధతిలో నిర్వహించాలి. అయితే, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, జిల్లా అధికారులు కూడా హుందాగా వ్యవహరించలేదు. పలుమార్లు మీడియా ప్రతినిధులు వెళ్లి ప్రశ్నించగా, వారిని గదమాయించే ప్రయత్నం చేశారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో అపశ్రుతులు

పోలీసు పరేడ్ మైదానం రెండు రోజులుగా కురిసిన వర్షాలతో చిత్తడిగా మారింది. అధికారులు కూడా ఏర్పాట్లను అంతంత మాత్రంగానే నిర్వహించారు. ఆహూతులు కూర్చునే వేదికల్లో కూడా నీరు చేరింది. శకటాలు ప్రదర్శన సందర్భంగా కొన్ని బురదలో కూరుకుపోయాయి. క్రేన్‌తో వాటిని బయటకు తీయించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు చాలా వరకు తగ్గించేశారు. ప్రదర్శించిన కొందరు కూడా బురద కారణంగా అసౌకర్యానికి గురయ్యారు. పార్కింగ్ ఏర్పాట్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. లోకేష్ రాగానే ఆయన కాన్వాయిని రోడ్డుకు అడ్డంగా నిలిపి మొత్తాన్ని బారికేడ్లతో మూయించారు.

త్యాగధనుల పోరాటంతోనే స్వాతంత్య్రం



జెండాను ఆవిష్కరిస్తున్న అంబటి, మోదుగుల, ఎమ్మెల్సీ ఏసురత్నం, నూరి ఫాతిమా, బాలవజ్రబాబు తదితరులు

- మాజీ మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు

పట్నంబజారు: త్యాగధనుల పోరాటాల ఫలితమే భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు చెప్పారు. భారతదేశ ప్రజలందరికీ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మువ్వెన్నల పతాకాన్ని ఆవిష్కరించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి ప్రజలు కోరుకున్న వారే పరిపాలకులుగా ఉండాలన్నది రాజ్యాంగం సుస్పష్టం చేసిందన్నారు. పులివెందుల, ఒంటిమిట్టలో ఎన్నికలు కుట్రలు, కుతంత్రాలతో జరిగాయని మండిపడ్డారు. పోలీసులు, పాలకులు, ఎన్నికల అధికారులు కుమ్మక్కై ఓటింగ్ ప్రక్రియ జరపడం సిగ్గుచేటన్నారు. స్థానికంగా లేని వ్యక్తులను ఓటు వేసేందుకు అధికారులు అనుమతించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ఉందన్నారు. ప్రజలకు పూర్తి విషయాలు తెలియాలంటే వెబ్ కెమెరాల విజువల్స్ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పష్టమైన విచారణ చేయించాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి సర్కార్ సూపర్ సిక్స్- సూపర్ హిట్ అని చెప్పటం విడ్డూరంగా ఉందని, సూపర్ సిక్స్ -సూపర్ ఛీట్ అని విమర్శించారు. ప్రమాదకర పరిస్థితుల్లో నేటి ప్రజాస్వామ్యం ఉందని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ పార్లమెంట్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవం అంటే దేశానికి పండుగ రోజని, మువ్వన్నెల జెండాను దేశ ప్రజలంతా ఎగురవేసి అమరవీరులను స్మరించుకోవాలన్నారు. నేడు రాష్ట్రంలో ఓటు వేసే స్వాతంత్య్రం కూడా లేకుండా పోయిందన్నారు. రిగ్గింగులు, బూత్ క్యాప్చర్ చేసి టీడీపీ నేతలు పండుగ చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఇలాగే కొనసాగితే స్వాతంత్య్ర దినోత్సవం అలంకార ప్రాయంగా నిలిచే అవకాశం ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు మేలుకోవాల్సిన అవసరం ఉందని, కూటమి తప్పులను ఖండించాలన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ వేడుక చేసుకునే గొప్ప పండుగ స్వాతంత్య్ర దినోత్సవమన్నారు. పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ ఎంతో మంది మహనీయుల త్యాగమే మన స్వాతంత్య్రమన్నారు. నేటి యువత ఆ మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజానారాయణ, షేక్ గులాం రసూల్, వంగల వలివీరారెడ్డి, మండేపూడి పురుషోత్తం, కొత్తా చిన్నపరెడ్డి, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, పఠాన్ సైదాఖాన్, నందేటి రాజేష్, బూరెల నాంచారమ్మ, సురసాని వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు ఆర్థిక వెసులుబాటు

రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



బస్సులో మహిళలతో ప్రయాణిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి టౌన్: స్త్రీ శక్తి పథకంతో రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రినాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా స్త్రీ శక్తి పథకాన్ని పండుగ వాతావరణంలో ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించవచ్చని తెలిపారు. సెప్టెంబర్‌లో మూడు వేల ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. తెనాలి డిపో నుంచి రోజుకు 17వేల మంది మహిళలు వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తున్నట్లు తెలియజేశారు. మహిళలు ఏదైనా ఐడీ కార్డు చూపిస్తే కండక్టర్ జీరో టికెట్ కొడతారని వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ, ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆయన సూచించారు. తెనాలి నుంచి నందివెలుగు వరకు మహిళలతో విజయవాడ బస్సులో మంత్రి మనోహర్ ప్రయాణించారు. నందివెలుగు స్టాప్ వద్ద పల్లెవెలుగు బస్సులను ఆయన పరిశీలించారు. జీరో టికెట్ కొట్టారో లేదో బస్సులోని మహిళా ప్రయాణికులను ఆయన అడిగారు. తెనాలి బస్టాండ్ నుంచి విజయవాడకు తాము తీసుకున్న టికెట్‌కు డబ్బు చెల్లించామని మహిళలు చెప్పారు. దీంతో మంత్రి కండెక్టర్‌ను ప్రశ్నించగా, తమకు ఉన్నతాధికారులు ఇంకా ఆదేశాలు ఇవ్వలేదని బదులిచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు, హెల్త్ ఆఫీసర్ ముప్పా ఏసుబాబు, పలువురు ఆర్టీసీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



పెదకాకాని: స్థానిక శివాలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థానంలోని కల్యాణ మండపంలో స్థానాచార్యులు పాత్తూరు సాంబశివరావు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. వ్రతంలో పాల్గొన్న ముత్తయిదువులకు దేవస్థానం తరఫున అమ్మవారి ప్రసాదంగా పసుపుకుంకుమ, జాకెట్ ముక్క, అష్టలక్ష్మీ దేవి రూపు, కంకణం అందజేశారు. భ్రమరాంబ అమ్మవారు లక్ష గాజుల ప్రత్యేక అలంకారంలో భక్తులను అనుగ్రహించారు.భక్తులు పెద్దసంఖ్యలో భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ పర్యవేక్షించారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు లక్ష్మీహారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం గుంటూరు జిల్లా వడ్లమూడికి చెందిన భక్తులు 82 గ్రాముల బంగారు లక్ష్మీహారాన్ని కానుకగా సమర్పించారు. వడ్లమూడికి చెందిన వి.శ్రవణ్‌కుమార్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. సుమారు రూ.8.50 లక్షల విలువైన 82 గ్రాముల బంగారం, పచ్చలతో తయారు చేయించిన లక్ష్మీహారాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఏఈవో ఎన్.రమేష్‌బాబు, ఇతర అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.



ఉత్తమ సేవలకు అవార్డులు


షేక్ ఖాజావలి డీఆర్వో, గుంటూరు | కె.శ్రీనివాసరావు ఆర్డీవో, గుంటూరు | ఎం.గంగరాజు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కె.ఆర్.సీసీ | పులి శ్రీనివాసులు కమిషనర్ జీఎంసీ | డి.దుర్గాబాయి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ | బి. ఉదయ్‌కుమార్ హ్యాండ్‌లూమ్స్ టెక్స్‌టైల్స్ ఏడీ | ఎ.విజయలక్ష్మి జీఎం ఇండస్ట్రీస్ | ఎస్.అనిత, సీనియర్ మెడికల్ ఆఫీసర్, జీజీహెచ్ | బి.వి.నాగసాయి కుమార్, డీపీఓ | పి.శేషశ్రీ సీపీఓ | ఎం.డి.నజీమా బేగం, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ


ఆర్.శ్రీనివాసమూర్తి ఎస్ఈ ఆర్ అండ్ బీ | టి.వి.విజయలక్ష్మి పీడీ, డీఆర్‌డీఏ | కె.సంజీవరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి | డాక్టర్ యశశ్వి రమణ సూపరింటెండెంట్ గుంటూరు జీజీహెచ్ | సదాశివరావు నాట్కో | జె. మోహన్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, జీఎస్‌డబ్ల్యూఎస్ | విజయకుమార్ ఐ అండ్ పీఆర్ | వెంకటేశ్వరరావు ఐ అండ్ పీఆర్ | పూర్ణచంద్రరావు ఏఓ, కలెక్టరేట్ | సీహెచ్. చైతన్య, డీటీ, యూఎల్‌సీ | వై. ధర్మతేజ, సీసీ టు కలెక్టర్


మంత్రి లోకేష్, కలెక్టర్ నాగలక్ష్మి నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా

జిల్లాలో ఉత్తమ సేవలందించిన పలు ప్రభుత్వ శాఖల అధికారులు స్వాతంత్య్ర దినోత్సవంలో మంత్రి లోకేష్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తదితర అధికారులు ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అవార్డులు అందుకున్న అధికారులను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు ఉత్తమ సేవలందించాలని సూచించారు. - సాక్షి, ఫొటోగ్రాఫర్


రిజ్వానా డిప్యూటీ తహసీల్దార్ | జాన్ రాజ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ పీజీఆర్ఎస్ | పృథ్వి జడ్పీ ఉద్యోగి | జి.వెంకటేశ్వరరెడ్డి ఆఫీస్ సబార్డినేట్ | రమేష్ గన్‌మెన్ టు కలెక్టర్ | మల్లీశ్వరి, మోటర్ వెహికల్ తనిఖీ అధికారి, గుంటూరు | అమృతారాణి, సహాయ మోటార్ తనిఖీ అధికారి, తెనాలి | రామకృష్ణ, వాచ్‌మేన్ ఈస్ట్ తహసీల్దార్ | జీఎస్. సునీల్‌రాజ్, లీగల్ మెట్రాలజీ, ఇన్‌స్పెక్టర్ | హనుమంతు (ఏఆర్) ఏఎస్పీ | బెల్లం శ్రీనివాసరావు సీఐ | వెంకటేశ్వరరెడ్డి ఏఎస్ఐ | పి.మన్నెయ్య హెచ్‌సీ, ఏఆర్ | ఎన్.రామకోటేశ్వరరావు పీసీ


రాజేంద్రప్రసాద్ హెచ్‌సీ, ఏఆర్ | పి.జాన్‌ఖాన్ ఏఎస్ఐ | నిస్సార్‌బాషా సీఐ | అశోక్‌కుమార్ సీఐ | వెంకట్ ఎస్ఐ | నాగరాజు హెచ్‌సీ | టి.విజయ్, పీసీ (జిల్లా ఎస్పీ పీఆర్ఓ) | గోవింద్, హోంగార్డు (జీజీహెచ్) | సైయద్ సాహెబ్ ఫ్యామిలీ కౌన్సెలింగ్ | ఎస్‌కె. జానీబీ ఏడబ్ల్యూ | బి. అరుణ సీడీపీఓ | ఎస్‌కె. మెహరున్నీస్సా సూపర్‌వైజర్ | ఎం. సుబ్బమ్మ ఈఓ

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

మంగళగిరి టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళగిరిలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 70 వేల ఎకరాల వరి పంట రైతులు నష్టపోయినట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో పంట వేసినప్పుడు వర్షాలు లేక ఎండిపోయిందని, అప్పుడు ఎకరానికి రూ.10 వేలు పెట్టుబడి పెట్టారని తెలిపారు. రెండో సారి వేసిన తరువాత అకాల వర్షాల కారణంగా నష్టపోయారని అన్నారు. గుంటూరు చానల్, కొండవీటివాగును రెండువైపులా వెడల్పు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడమే నష్టానికి కారణమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి


జాన్ మెడకు అయిన గాయం

తెనాలిరూరల్: పాతకక్షల నేపథ్యంలో యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేసి గాయపర్చిన ఘటన మండలంలోని కొలకలూరులో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉన్నం చినజాన్, సుద్దపల్లి రవీంద్రకు గతంలో విభేదాలున్నాయి. ఇద్దరు కలసి మద్యం తాగే క్రమంలో వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. రవీంద్ర వెంట తెచ్చిన కత్తితో జాన్‌పై దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం తాడేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు పంపారు. జాన్ ఇచ్చే స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

దేశాభివృద్ధిలో రైల్వేశాఖది కీలకపాత్ర

- రైల్వే డీఆర్ఎం సుథేష్ణ సేన్
- ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

లక్ష్మీపురం: భారతీయ రైల్వేలు కేవలం రవాణా సాధనం కాదు, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని రైల్వే డీఆర్ఎం సుథేష్ణ సేన్ అన్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నల్లపాడు మైదానంలో 79వ స్వాతంత్య్ర వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత రైల్వే పోలీసులు నిర్వహించిన పరేడ్‌లో పాల్గొని జాతీయ పతాకాన్ని డీఆర్ఎం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో డివిజన్ అనేక విజయాలను, లక్ష్యాలను సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.


జాతీయ పతకావిష్కరణ చేస్తున్న గుంటూరు రైల్వే డీఆర్ఎం సుథేష్ణ సేన్

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో..

నగరంపాలెం: దేశవ్యాప్తంగా అందరూ నిర్వహించుకునే వేడుక స్వాతంత్య్ర దినోత్సవమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర వేడుకలు జరిగాయి. జాతీయ జెండాను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఎగురవేశారు. జిల్లా ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, ఏవో అద్దంకి వెంకటేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాస్, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, సురేష్, పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


జాతీయ జెండాను ఎగురవేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలు అదుపు

మంగళగిరి టౌన్: అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో నేరాలను అదుపు చేస్తున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాష్ట్ర శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్య్ర వేడుకలను నిర్వహించారు. శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మతో కలసి కమిషనర్ నిశాంత్ కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.


జెండా వందనం చేస్తున్న ఎక్సైజ్ రాష్ట్ర శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్

అమరవీరుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్య్రం

కొరిటెపాడు(గుంటూరు): ఎందరో అమర వీరుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్య్రం వచ్చిందని, వాటి ఫలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని భారత పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ పేర్కొన్నారు. జీటీ రోడ్‌లోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర వేడుకలను నిర్వహించారు. జాతీయ పతాకాన్ని వారు ఆవిష్కరించారు. యశ్వంత్‌కుమార్, విశ్వశ్రీ మాట్లాడుతూ దేశంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు ఉండాలని, మన దేశ ప్రగతిని, సాధించిన లక్ష్యాలను గుర్తుపెట్టుకొని మనమంతా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగధనుల పోరాటాలను స్మరించుకోవాలి

పెదకాకాని(ఏఎన్‌యూ): విదేశీయుల పాలన నుంచి భారతదేశం స్వేచ్ఛా స్వాతంత్య్రాలను సాధించేందుకు కృషిచేసి అసువులు బాసిన త్యాగధనుల పోరాటాలను నేటి యువత స్మరించుకోవాలని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె గంగాధరరావు అన్నారు. వర్సిటీలోని వ్యాయామ విద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.పి.ఎస్ పాల్‌కుమార్ అధ్యక్షత వహించారు. తొలుత జాతీయపతాకాన్ని ఎగురవేశారు. ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె రత్న షీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం, డిగ్రీ, పీజీ పరీక్షల కో–ఆర్డినేటర్లు ఆచార్య కృష్ణారావు, ఆచార్య సుబ్బారావు, సీడీఈ డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ రామచంద్రన్, విదేశీ విద్యార్థుల సెల్ డైరెక్టర్ ఆచార్య పద్మావతి, పాల్గొన్నారు.

రాష్ట్ర విపత్తుల కార్యాలయంలో....

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని రాష్ట్ర విపత్తుల కార్యాలయంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్ త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు, యోధులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, ఎన్‌డీఆర్ఎఫ్,ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర విపత్తుల కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ప్రఖర్ జైన్ తదితరులు


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

జిల్లా అంబులెన్స్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ప్రారంభం



గుంటూరు రూరల్: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా అంబులెన్స్ డ్రైవర్స్ , వర్కర్స్ యూనియన్‌ను శుక్రవారం ప్రారంభించారు. జాతీయ జెండాను ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. శివాజీ, సీఐటీయూ జెండాను ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకుడు టీవీజీ రవిశంకర్, గుంటూరు జిల్లా అంబులెన్స్ డ్రైవర్స్ -వర్కర్స్ యూనియన్ బోర్డును యూనియన్ గౌరవాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి ఆవిష్కరించారు. శివాజీ మాట్లాడుతూ ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ దేశవ్యాప్తంగా రవాణా కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. సీఐటీయూ అనుబంధంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్న అంబులెన్స్ డ్రైవర్లను అభినందించారు. ఆటోలు, అంబులెన్స్, ఇతర రవాణా కార్మికులకు ప్రభుత్వమే పార్కింగ్, వెయిటింగ్ హాల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ అంబులెన్స్ డ్రైవర్లకు ఏ సమస్య వచ్చినా ఎల్లవేళలా సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి శంకర్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై పలు భారాలు మోపుతున్నాయన్నారు. వాటికి వ్యతిరేకంగా భవిష్యత్తులో పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ గుంటూరు నగర తూర్పు, పశ్చిమ ప్రధాన కార్యదర్శులు కట్లకుంట శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, నగర నాయకులు షేక్ ఖాసీం వలి, ఆది నికల్సన్, షేక్ ఖాసిం షహీద్, దొడ్డా కోటేశ్వరరావు, యూనియన్ నాయకులు షేక్ బాషా, ఈసూబ్, వాజిద్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

దేశ రక్షణ కోసం రెడ్ షర్ట్ ఆర్మీ సిద్ధంకావాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల


ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ముప్పాళ్ల తదితరులు

మంగళగిరి టౌన్: బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, దేశ రక్షణ కోసం రెడ్ షర్ట్ ఆర్మీ సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఒంగోలులో ఈనెల 28న జరగనున్న రాష్ట్ర మహాసభల్లో పాల్గొనున్న రెడ్‌షర్ట్ వలంటీర్లకు మంగళగిరి నగర పరిధిలోని బైపాస్ కనకదుర్గమ్మ అమ్మవారి గుడి వద్ద గల ప్రాంగణంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని శుక్రవారాన్ని ఆయన నాయకులతో కలసి సందర్శించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చురుకైన పాత్ర పోషించాలని తెలిపారు. దేశంలో విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి రెడ్‌షర్ట్ ఆర్మీ సిద్ధం కావాలని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరువ చేసి సామాజిక చైతన్యం పెంపొందించడంలో ముందుండి కృషి చేయాలని సూచించారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువత, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా నేటి ప్రభుత్వాలు కార్పొరేట్ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నితిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, నాయకులు కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు పాల్గొన్నారు.